క్లుప్తంగా

భక్తులతో ఉరుకుంద కిటకిట



ప్రత్యేక అలంకరణలో ఈరన్నస్వామి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. తరలి వచ్చిన భక్తులతో క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం తదితర విశేష పూజల అనంతరం ఫలపుష్పాలతో అలంకరించారు. కొందరు అక్కడే పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో చిన్నారి ప్రతిభ



నృత్యం చేస్తున్న సుకృతి

ఆదోని అర్బన్ : విజయవాడలో సంస్కార్‌భారతి వారు ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో పట్టణానికి చెందిన సుకృతి ద్వితీయస్థానంలో ప్రతిభ కనబరిచింది. స్థానిక శ్రీగురు కృప నృత్యాలయం గురు వు వీరాజ్‌రాయల్ సోమవారం మాట్లాడుతూ సబ్ జూనియర్ విభాగం కూచిపుడి నృత్యంలో సుకృతి ద్వితీయస్థానం కైవశం చేసుకుందన్నారు. పోటీలకు విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కృష్ణా తదితర జిల్లాల నుంచి వంద మంది చిన్నారులు పాల్గొన్నారని, తమ నృత్యాలయం నుంచి 14 మంది పాల్గొనగా, సుకృతి ద్వితీయస్థానంలో నిలిచిందని చెప్పారు.

రామలింగేశ్వరుడికి విశేష పూజలు

మంత్రాలయం రూరల్: మండలంలోని రాంపురం గ్రామంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామికి సోమవారం విశేష పూజలు చేపట్టారు. పూజల్లో వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని పాతవూరులో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ మాలధారులు, భక్తులు ఫల, పుష్ప, క్షీర,పంచామృతాభిషేకాలతో అభిషేకించారు. శ్రీమఠంలోని శివలింగానికి పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి వారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ

మంత్రాలయంరూరల్:మండలంలోని ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసినట్లు ఎంఈఓ మెహీనుద్దీన్ తెలిపారు. సోమవారం ఆయా పాఠశాలల్లోని ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ గురించి రాష్ట్ర అబ్జర్వర్ విశ్వేశ్వరయ్య, జిల్లా అబ్జర్వర్ జయసింహా క్షుణంగా పరిశీలించారని చెప్పారు.ఎలా నమోదు చేయాలి అనే అంశాల గురించి నిర్వాహకులతకు తెలియజేశామన్నారు.

విజయవంతం చేయండి

ఆదోని రూరల్: ఉపాధి హామీ పథకంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఈనెల 7వ తేదీన పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న పిలుపునిచ్చారు. మండలంలోని కుప్పగల్, పాండవగల్లు గ్రామాల్లో సోమవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే అందించాలని, కూలీలకు పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించి, గిట్టుబాటు వేతనం అందించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం మండలాధ్యక్షుడు కె.శేఖర్, వ్యవసాయ కార్మికసంఘం మండల నాయకుడు కె.గోవిందు, కృష్ణ పాల్గొన్నారు.

రూ.39 లక్షలతో బస్టాండ్ ఆధునికీకరణ



ఆలూరు బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీసీఎం వెంకటరమణ, ఆదోని డీఎం రఫీక్

ఆలూరు రూరల్: ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా రూ.39 లక్షలతో ఆలూరు ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ వెంకటరమణ తెలిపారు. ఆయన సోమవారం ఆదోని డీఎం రఫీక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆలూరు బస్టాండ్ ఆవరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్టాండ్ స్థలం ఆక్రమణకు గురి కాకుండా చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నామన్నారు. అలాగే మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు తప్పనిసరిగా బస్టాండులో నిలిపేలా ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఎప్పుడూ వలస వెళ్లలేదు



ఇన్నేళ్లలో తానెప్పుడూ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లలేదని చెబుతున్న ఈయన పేరు చిన్న భీంరెడ్డి. అర్లబండ గ్రామానికి చెందిన ఈయన ప్రస్తుతం గ్రామంలోనే ప్రభుత్వం కల్పించిన ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తున్నాడు. రోజుకు రూ.240 వరకు వేతనం లభిస్తోందని పేర్కొంటున్నాడు. వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే ఉపాధి పనులు కల్పించడంతో వలసలు చాలా వరకు తగ్గాయని తెలియజేశాడు.

గ్రామంలోనే పనులు ఉన్నాయి..



ఖరీఫ్, రబీ సీజన్‌లో వ్యవసాయ పనులు చేసుకున్నామని చెబుతున్న ఇతడి పేరు పింజరి బాషా. అర్లబండ గ్రామంలో వ్యవసాయపనులు ముగిసిన వెంటనే పనులు కావాలని కూలీలంతా అధికారులను కోరడంతో వారు పనులు చూపారని తెలియజేస్తున్నాడు. ప్రస్తుతం గ్రామంలో కాల్వల్లో పూడికతీత పనులు చేస్తున్నామని పేర్కొంటున్నాడు.

సీజనల్ హాస్టల్ ఆదుకుంది..



కోసిగి చెందిన ఈ విద్యార్థి పేరు కృష్ణ. పట్టణంలో ఐదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు తిమ్మక్క, తిమ్మప్ప గుంటూరు వెళ్తూ కుమారుడిని ఇక్కడే వదిలి వెళ్లారు. పిల్లాడి చదువు మధ్యలో ఆగిపోకూడదని ఉపాధ్యాయులు కడపాశెం ఆది ఆంధ్ర స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్‌లో చేర్పించారు. ప్రస్తుతం వసతితో పాటు విద్యనందిస్తుండటంతో విద్యార్థి సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

‘ఉపాధి’ జోరు

- గ్రామాల్లో అడిగిన వారందరికీ ‘ఉపాధి’ పనులు
- వలసల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- పలుచోట్ల సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు

గతనెల 30 నుంచి ఈనెల 4వ తేదీ వరకు మండలంలో ఉపాధి పనులకు హాజరైన కూలీల వివరాలు..

వారం	కూలీల సంఖ్య
సోమవారం	2,350
మంగళవారం	2,385
బుధవారం	2,215
గురువారం	2,419
శుక్రవారం	2,435
శనివారం	2,456



కోసిగి సీజనల్ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు



కోసిగి సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోసిగి: గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగియడంతో జాతీయ గ్రామీణ హామీ పథకం పనులు ఊపందుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పనుల కోసం వలస వెళ్లకుండా పనులు అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తున్నారు. మండలంలో 24 పంచాయతీల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం 2,760 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. ఫాంపాండ్స్, డగ్ అవుట్స్, పూడికతీత పనులు చేస్తున్నారు. చేసిన పనులకు వారానికొకసారి పెండింగ్‌లో లేకుండా వేతనాలు చెల్లిస్తున్నారు.

గ్రామ సభలతో ప్రజల చైతన్యం..

వలస నివారణ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండలంలో ప్రతి గ్రామంలో సర్పంచ్‌లు, ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో కలిసి గ్రామ సభలు ఏర్పాటు చేసి వలసలు వెళ్లకుండా ప్రజలకు చైతన్యం కల్పిస్తున్నారు. అధిక సంపాదన కోసం వలసలు వెళ్లి చదువకునే పిల్లల జీవితాలను నాశనం చేయొద్దని సూచిస్తున్నారు. పిల్లల భవిషత్ లక్ష్యంగా పిల్లలను బడులకు పంపి, ఉపాధి హామీ పథకం పనులు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల జిల్లా ఉన్నత అధికారులు పర్యటించి వివిధ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని చింతకుంట, పల్లెపాడు, దుద్ది, కొల్మాన్‌పేట, కోసిగి ప్రాంతాల్లో ప్రజలను చైతన్య వంతులు చేశారు.

పిల్లల సంక్షేమం కోసం సీజనల్ హాస్టళ్లు..

వలస వెళ్లిన వారి పిల్లల కోసం ప్రభుత్వం సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసి విద్యను అందిస్తోంది. మండలంలోని కందుకూరు, ఐరన్‌గల్లు, కోసిగిలోని ఆది ఆంధ్ర, చాకలి గేరి ప్రాథమిక పాఠశాలల పరిధిలో మొదటి విడుతలో సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పాఠశాలలో 50 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి ప్రత్యేక ట్యూటర్‌ను ఏర్పాటు చేసి విద్యనందిస్తున్నారు. పొదుపు గ్రూపు సభ్యులు విద్యార్థులకు మెనూ ప్రకారం పాఠశాల వేళల్లో ఉదయం టిఫిన్, సాయంకాలం భోజన వసతి ఏర్పాటు చేశారు. అలాగే సెలవు దినాల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం వేళల్లో భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.

అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నాం



కోసిగి మండలంలో కూలీలు పనుల కోసం ఇతర పట్టణాలకు వెళ్లకుండా గ్రామంలోనే అడిగిన వారందరికీ పనులు చూపుతున్నాం. వలసల నివారణకు గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్య పరుస్తున్నాం. పనిచేసిన దినాలకు వారం సొమ్ము ఒకే సారి కూలీల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నాం. వేతనాలు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు వలస వెళ్లి ఇబ్బందులు పడకుండా గ్రామంలోనే పనులు చేసుకోవాలి.

– జయరాం, ఏపీఓ

జాతీయ జట్టుకు ఎంపిక



ఎంపికైన నూర్జహాన్

కోసిగి: మండలంలోని డి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.నూర్జహాన్ ఎస్‌జీఎఫ్ అండర్ –17 జాతీయ స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైందని పాఠశాల పీఈటీ పెద్ద మాబాషా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత నెల 23 నుంచి 25వ తేదీ వరకు విజయనగరం జిల్లా నీలిమర్ల మండలంలోని అలుగోలు జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో కర్నూలు జిల్లా జట్టు తరఫున కె.నూర్జహాన్, కె.లక్ష్మీ పాల్గొన్నారు. పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయ స్థానం కై వసం చేసుకుంది. క్రీడలో అత్యంత ప్రతిభ చూపిన నూర్జహాన్‌ను జాతీయ పోటీలకు ఎంపిక చేస్తూ ఆదేశాలు అందాయని చెప్పారు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, గ్రామస్తులు క్రీడాకారిణిని అభినందించారు.

చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలి

కౌతాళం: ఎల్కేజీ, యూకేజీ విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలని స్థానిక జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ గౌరమ్మ తెలిపారు. సోమవారం ప్రతిభ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పేరును చైల్డ్ ఇన్ఫోలో తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. పదో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు పరీక్షల గురించి వివరించి పలు సూచనలు చేశారు. సీఆర్పీ రామాంజనేయులు, హెచ్‌ఎం జ్ఞానేశ్వరి, కార్యదర్శి మైనుద్దీన్, మ్యాథ్స్ అసిస్టెంట్ జయలక్ష్మి ఉన్నారు.

ఆర్థిక సాయం

ఆదోని అర్బన్: జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, ఆదోని ఇన్‌చార్జ్ మల్లప్ప ఆధ్వర్యంలో సోమవారం బాధితా కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. గతేడాది నవంబర్ నెలలో ప్రమాదంలో మృతి చెందిన నామాల పరశురామ్ కుటుంబానికి రూ.5 లక్షలు, ప్రమాదంలో గాయపడిన కురువ పెద్దరాజు కుటుంబానికి రూ.16,500 చెక్కు అందజేశారు.



అగసలదిన్నె నుంచి సుళేకేరి వెళ్లే ఆయకట్టు రోడ్డు (నాడు)



మరమ్మతులు చేపట్టడంతో రూపు మారిన ఆయకట్టు రోడ్డు (నేడు)

తీరిన అవస్థ



కల్వర్టు నిర్మిస్తున్న దృశ్యం

కౌతాళం: అగసలదిన్నె–సుళేకేరి గ్రామాల మధ్య ఉన్న ఆయకట్టు రోడ్డు శిథిలమవడంతో రైతులు ఏళ్లుగా అవస్థలు పడుతున్నారు. సమస్యను గుర్తించిన ఎంపీపీ అమరేష్ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.15లక్షలు మంజూరు చేయించి పనులు చేయించడంతో రోడ్డు బాగుపడింది. దీంతో వారి ఇబ్బందులు తీరినట్లయ్యింది.

నాడు శిథిలమై..

గతంలో రోడ్డు సరిగా లేకపోవడంతో పొలాలకు, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న సుళేకేరి గ్రామానికి వెళ్లడానికి మరో పది కి.మీ. చుట్టూ తిరిగి వెళ్లేవారు. ఇక ఎరువులు, రోజూ పనులకు వెళ్లాలన్నా, దిగుబడులను తెచ్చుకోవలన్నా రైతులు ఎన్నో అవస్థలు పడ్డారు. రేగడి భూమి కావడంతో చిన్నపాటి వర్షం వచ్చినా బురదమయమయ్యేది. ఈ రోడ్డులో సుమారు 900 ఎకరాల ఆయకట్టు ఉంది. రోడ్డు బాగు చేస్తే పొలాలకు వెళ్లడానికి, సుళేకేరి, హాల్వి గ్రామాలకు వెళ్లడానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఎంపీపీకి వివరించారు. స్పందించని ఆయన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించారు. 3కి.మీ.మేర రోడ్డును వేసినట్లు పంచాయితీ రాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మధ్యలో రెండు చోట్ల కల్వర్టులు నిర్మించినట్లు చెప్పారు. సుళేకేరి గ్రామానికి మరో కిలోమీటర్ వరకు రోడ్డు వేయాల్సి ఉంది. ఈ పని కూడా పూర్తయితే రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాఫీగా సాగుతాయి. పనులు చేయిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఐరన్ మాత్రల పంపిణీ

ఆదోని అర్బన్ : రక్త హీనతతో బాధపడుతున్న విద్యార్థినులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేసినట్లు డాక్టర్ బాలస్వామి, అధ్యాపకులు జొనాథన్ సోమవారం తెలిపారు. గత నెలలో నిర్వహించిన రక్త పరీక్షల్లో రక్తహీనతతో బాధపడుతున్న ఇంటర్, డిగ్రీ విద్యార్థినులను గుర్తించినట్లు చెప్పారు. వారికి హరివాణం ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఆధ్వర్యంలో ఐరన్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భారతి ఉన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న పరిపాలనాధికారి గోవింద్‌సింగ్

ఆదోని రూరల్: స్పందన అర్జీల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పరిపాలనాధికారి గోవింద్‌సింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంచేపట్టారు. డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీ స్వీకరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలని సూచించారు.

సమస్యల్లో కొన్ని..

- గొనెగండ్ల మండల కేంద్రానికి చెందిన కొత్తింటి మోదిన్‌సాబ్‌కు సంబంధించి 10వ వార్డు సమీపంలో ప్రభుత్వం ఇంటి పట్టా మంజూరు చేసింది. ప్రస్తుతం తన స్థలం ఆక్రమణకు గురైందని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం సాంబగల్లు గ్రామంలో సర్వే నంబర్ 94/16లో 0.79 సెంట్ల భూమిలో ప్రభుత్వ పాఠశాల ఉంది.కొందరు ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించారని, విచారణ చేపట్టి చర్యలు తీ సుకోవాలని గ్రామానికి చెందిన అస్లాంభాద్రి కోరా రు.
- కోగిలతోట గ్రామం మీదుగా హొళగుంద నుంచి గూళ్యం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని, గ్రామంలో రోడ్డు స్థలం ఆక్రమణకు గురైందని, సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన గురుపాదమ్మ అర్జీ అందజేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, వ్యవసాయశాఖ ఏడీఏ గిరీష్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, ఎస్‌డబ్ల్యూఓ సుధాకర్, ఆదోని మున్సిపల్ మేనేజర్ విజయ్‌భాస్కర్ కుమార్‌రెడ్డి, సీనియర్ సహాయకులు రామయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి

ఆదోని టౌన్: సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి వివిధ సెక్షన్ల అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. క్రైస్తవుల సమాధితోటలో మౌలిక వసతులను కల్పించాలని ఒకరు, చేదోడు పథకం కింద తమకు లబ్ధి చేకూరడం లేదని చాకలి పెద్దనాగప్ప కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. అక్షరశ్రీ స్కూల్ సమీపంలో పురాతనబావిని కొందరు కబ్జా చేశారని, బావి, ఖాళీ స్థలాన్ని పరిరక్షించాలని నరసింహులు ఫిర్యాదు చేశారు. రోడ్డు, కాలువల సమస్య ఉందని, సయ్యద్ మహ్మద్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటర్ ట్యాక్స్ పెండింగ్‌లో ఉందని, పరిష్కరించాలని ఖాజాహుసేన్ దరఖాస్తు అందజేశారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



భక్తులకు సందేశం వినిపిస్తున్న నిజానందస్వామి

కోసిగి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని మిట్టామల్కాపురం ఆరూఢజ్యోతి శాంతాశ్రమం ఆలయ పీఠాధిపతి నిజానంద స్వామి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సజ్జలగుడ్డం గ్రామంలో వెలసిన శ్రీ సిద్దరూఢ స్వామి ఆలయ రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి అభిషేకం, ఫల, పుష్పాలతో అలంకరణ గావించి మహా మంగళహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారి విగ్రహాన్ని కలశాలు, డప్పు వాయిద్యాలతో ఆలయం నుంచి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఊరేగింగించి తిరిగి ఆశ్రమానికి చేర్చారు. ముఖ్య అతిథులుగా హాజరైన పీఠాధిపతులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు సిద్దరూఢ స్వామి ప్రత్యేకతను వివరించారు. గ్రామ పెద్దలు మల్లయ్య, జాంబవంతు, మల్లికార్జున, తిరుమల తదితరులు పీఠాధిపతిని సత్కరించి ఆశీర్వచనాలు పొందారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆదోని అర్బన్: పట్టణంలోని ఝాన్సీ లక్ష్మిబాయి కూరగాయల మార్కెట్ సమీపంలో దుకాణంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని వన్‌టౌన్ పోలీసులు సోమవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ విక్రమసింహా తెలిపిన వివరాల మేరకు.. అల్తాఫ్ దుకాణంలో రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం రావడంతో దాడులు చేయగా 11 ప్యాకెట్లు (5.50 క్వింటాళ్లు) స్వాధీనం చేసుకున్నామని కేస దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నా రు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ : ఆదోని సెబ్ అధికారులు సోమవారం జరిపిన దాడుల్లో పట్టణంలోని ఆటో స్టాండు వద్ద పట్టణానికి చెందిన రాజు అనే వ్యక్తి బ్యాగ్‌లో ఉన్న 144 కర్ణాటక మద్యం ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకొని, రాజును అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవ రైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని విక్రయించినా, తరలించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పోలీసులకు అప్పగింత

ఆదోని అర్బన్:పట్టణంలోని పూలబజార్‌లో ముగ్గురు బాలలు ఒక మేకపిల్లను ఎత్తుకెళ్తుండటాన్ని చూసి స్థానికులు వారిని సోమవారం వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. తిరుమలనగర్‌కు చెందిన ఇద్దరు, ఫెయిత్ హోంకు చెందిన ఒకరు స్కూల్‌కు వెళ్లకుండా మధ్యాహ్నం పూలబజార్‌లో మేక పిల్లను ఎత్తుకెళ్తుండగా గుర్తించారు. బాలలు కనిపించకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే వన్ టౌన్ సీఐ విక్రమసింహా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దొంగతనాలు చేయకూడదని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- గృహ సారథులు, కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలి
- మంత్రి గుమ్మనూరు జయరాం దిశానిర్దేశం



మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం



హాజరైన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు

ఆలూరు: ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. ఎల్లార్తి రోడ్డు సమీపంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆలూరు మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో ఆలూరు, చిప్పగిరి మండలాలకు చెందిన గృహ సారథులు, కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎలాంటి వివక్ష లేకుండా పార్టీలు, కులం, మతం చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారన్నారు. అన్ని పార్టీల వారికి పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందని వివరించారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో మూడున్నరేళ్ల కాలంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ప్రభుత్వం దాదాపు వెయ్యి కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రస్తుత, గత ప్రభుత్వ పాలనలో తేడాలను వివరించాలని సూచించారు. నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, ఎంపీపీలు రంగమ్మ, జూటూరు హేమలత, నాయకులు మల్లికార్జున రెడ్డి, రాంభీమ్‌నాయుడు, నారాయణ, మారయ్య, మల్లికార్జున, బీసీ మాదన్న శ్రీరాములు, నాగవేణి, శ్రీధర్, హనుమయ్య, ఆలూరు, చిప్పగిరి మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో సోమవారం నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.ప్రదీప్‌కుమార్, పి.సంతోష్‌కుమార్ పర్యటించారు. గ్రామసభ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు రాష్ట్రంలో పక్కాగా అమలవుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో సందర్శించి ఉపాధి పనులు, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇంటి నిర్మాణాలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వైకేపీ ద్వారా అమలయ్యే సంక్షేమ పథకాలు, ఉపాధి పనులు, వేతనాలు, పనిదినాలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, ఇంటి నిర్మాణాలు బాగున్నాయని తెలిపారు. సర్పంచ్ లక్ష్మి, వాటర్‌షెడ్ పీడీ సలీంబాషా, ఏపీడీ అలీపీర, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, వైకేపీ ఏపీఎం చిన్నవీరన్న, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపారని పీడీ రాముడు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం క్రీడాకారులు ఉష, మహేంద్ర, విజయకుమార్‌ను ప్రిన్సిపాల్ ఫణీంద్ర, పీడీ రాముడు, ఉపాధ్యాయులు అభినందించారు. వారు మాట్లాడుతూ.. 8వ తరగతి చదువుతున్న ఉష గత డిసెంబర్ 25, 26 తేదీల్లో కర్నూలులో అండర్ –14 విభాగంలో జరిగిన బ్రాడ్ జంప్, 600 మీటర్ల రన్నింగ్‌లో మొదటి స్థానం, మరో 600 మీటర్ల రన్నింగ్‌లో రెండవ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలతో పాటు జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 9, 10 తేదీల్లో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉష వెళ్తున్నట్లు చెప్పారు. అలాగే అండర్– 19 విభాగంలో ఈనెల 2, 3 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేటలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ 57 కేజీల విభాగంలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న మహేంద్ర మూడవ స్థానం, 61 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విజయ్‌కుమార్ మూడవ స్థానంలో నిలిచినట్లు పీడీ చెప్పారు.

ముగిసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల ఫారెస్ట్‌లో కొలువుదీరిన కొలుట్ల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. చెన్నకేశవ స్వామి, శ్రీదేవి, భూదేవిలకు ప్రత్యేక పూజలు, వసంతోత్సవం, పారువేట, చక్ర స్నానం నిర్వహించారు. అనంతరం హుండీ ఆదాయం లెక్కించగా రూ 2,67,677 సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ హనుమంతరెడ్డి, ఈఓ బి.చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. అలాగే టికెట్ల విక్రయం ద్వారా రూ 53,485, తలనీలాల నుంచి రూ 3.60 లక్షలు, టెంకాయల విక్రయం ద్వారా రూ 1.60 లక్షలు, దాతల నుంచి డొనేషన్లు రూ 1.10 లక్షలు సమకూరినట్లు చెప్పారు.